క్లుప్తంగా

తుపాను బాధితులకు పట్టల పంపిణీ



కోయవారిపాలెం (ప్రత్తిపాడు): మిచాంగ్ తుపాను బాధితులకు దళిత బహుజన రిసోర్స్ సెంటర్ ఆధ్వర్యంలో టార్పాలిన్ పట్టల పంపిణీ జరిగింది. తుపాను ప్రభావంతో కోయవారిపాలెంలో ఎస్టీ కాలనీ వాసుల ఇళ్ల కప్పులు పాక్షికంగా దెబ్బతిన్నాయి. దీంతో వారికి శనివారం గ్రామ సర్పంచ్ రావిపూడి వీరమల్లేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి శ్వేత పట్టలను అందించారు. స్వచ్ఛంద సంస్థలు బాధితులను ఆదుకునేందుకు ముందుకు రావడం అభినందనీయమని సెక్రటరీ శ్వేత అన్నారు. కార్యక్రమంలో ప్రత్తిపాడు ఏరియా కో ఆర్డినేటర్ కూరపాటి నిర్మల, గ్రామస్తులు పాల్గొన్నారు.

అయోధ్య రాముని అక్షింతల పంపిణీ

గుంటూరు రూరల్: అయోధ్య రాముని అక్షింతలను నల్లపాడు గ్రామంలో శనివారం పంపిణీ చేశారు. అయోధ్య రామాలయం ప్రతిష్ఠ ఆహ్వాన పత్రాలను అందజేశారు. విశ్వయోగి శ్రీనివాస ప్రభు స్వామి హనుమత్ గాయత్రి పీఠం పర్యవేక్షణలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. నల్లపాడు ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు రామభక్తులు అశోక్, మల్లికార్జున్‌రెడ్డి, శివప్రసాద్, నాగార్జున భక్తులు పాల్గొన్నారు.

యువ ఇంజినీర్లు సమస్యల పరిష్కారంపై దృష్టి సారించాలి



ప్రత్తిపాడు: ఆర్థిక మాంద్యం లోనూ యువత ఉద్యోగాలు సంపాదించాలంటే సమస్యలను పరిష్కరించే నైపుణ్యాలను కలిగి ఉండాలని ప్రగ్మేటిక్ సిస్టమ్స్ సీఈఓ భరత్‌కుమార్ రెడ్డి అన్నారు. వట్టిచెరుకూరు మండలం పుల్లడిగుంట మలినేని మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం మేక్ స్కిల్డ్ అండ్ ఐఈఈఈ స్టూడెంట్ ఫోరం ఆధ్వర్యంలో డిజైన్ థింకింగ్ అండ్ క్రిటికల్ అనలైసిస్‌పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ప్రగ్మేటిక్ సిస్టమ్స్ సీఈవో భరత్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో ఉద్యోగాలు సాధించడం కష్టతరంగా ఉందన్నారు. ప్రాబ్లమ్ సాల్వింగ్ స్కిల్స్‌పై దృష్టి సారించి వాటికి పరిష్కార మార్గాలు చూపడం ద్వారా మాత్రమే ఇన్వెస్టర్లను ఆకర్షించగలమని, అదేవిధంగా ఉద్యోగాల కల్పనను సృష్టించుకోవచ్చని తెలిపారు. మలినేని కళాశాలల చైర్మన్ డాక్టర్ మలినేని పెరుమాళ్లు, ప్రిన్సిపల్ డా. జెట్టి అప్పారావు, ఈసీఈ విభాగాధిపతి డాక్టర్ డి. విజయసారథి అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాద బాధితులకు 'బజరంగ్' తోడ్పాటు



నగరంపాలెం: పొన్నూరు మండలం చిన్నఇటికంపాడు ఎస్సీ కాలనీలో దొరపల్లి కరుణాకర్ ఇల్లు, మన్నవ గ్రామంలో వేర్వేరుగా రెండు ఇళ్లు దగ్ధమయ్యాయి. ఈ క్రమంలో దొరపల్లి కరుణాకర్, చల్లా శిలువరాజు, బండ్లమూడి నల్లారావు కుటుంబాలను శనివారం బజరంగ్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు అంబటి మురళీకృష్ణ పరామర్శించారు. ప్రమాదం జరిగిన తీరుని అడిగి తెలుసుకున్నారు. బాధితులను ఓదార్చి ఆయన అండగా ఉంటామని భరోసానిచ్చారు. వారికి కొంత తోడ్పాటునందించారు. ఇటీవల గ్రామంలో చేపట్టిన బజరంగ్ నేత్రజ్యోతి కార్యక్రమంలో కళ్ళజోళ్ల పంపిణీపై స్థానిక మహిళలు బజరంగ్ సేవలను కొనియాడారు.

జూదరుల అరెస్టు

పట్నంబజారు: పేకాట ఆడుతున్న వారిని పోలీసులు అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచారు. లాలాపేట పోలీసుల కథనం ప్రకారం ఐపీడీ కాలనీలోని శ్మశానం వద్ద ఎనిమిది మంది పేకాట ఆడుతున్న క్రమంలో ఎస్ఈబీ పోలీసులు అదుపులోకి తీసుకు న్నారు. వారి నుంచి రూ. 4,960లు స్వాధీనం చేసుకున్నారు. ఈమేరకు ఎనిమిది మందిని అరెస్టు చేసి కోర్టులో హాజరు పరుస్తున్నట్లు తెలిపారు.

అవ్వాతాతల మోములో చిరునవ్వులు

ప్రత్తిపాడు వైఎస్సార్ సీపీ సమన్వయకర్త బలసాని కిరణ్‌కుమార్



పింఛన్లు పంపిణీ చేస్తున్న సమన్వయకర్త బలసాని కిరణ్‌కుమార్

ప్రత్తిపాడు: అవ్వాతాతల మోములో చిరునవ్వులు నింపేందుకే మాట ప్రకారం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పింఛను నగదు రూ.3 వేలకు పెంచారని ప్రత్తిపాడు వైఎస్సార్ సీపీ సమన్వయకర్త బలసాని కిరణ్‌కుమార్ అన్నారు. వట్టిచెరుకూరు మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం పింఛను పెంపు వారోత్సవాలను ఎంపీడీఓ శేషగిరిరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా బలసాని కిరణ్‌కుమార్ హాజరయ్యారు. వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులకు పింఛన్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ, మతం, కులం చూడకుండా అర్హతే ప్రామాణికంగా పింఛన్లు అందిస్తున్నట్లు చెప్పారు. సీఎం వైఎస్ జగన్ చిత్తశుద్ధితో సంక్షేమ కార్యక్రమాలను నిర్విరామంగా అమలు చేస్తున్నారని, మనస్సాక్షితో ఆలోచించి ఎన్నికల్లో ఓటు వేయాలని కోరారు. చంద్రబాబు పాలనలో పింఛను మొదలు రైతు రుణమాఫీ వరకు ఏ ఒక్క హామీనీ అమలు చేయలేదని బలసాని విమర్శించారు. పేదల గురించి అసలు ఆలోచన చేసిందే లేదని, అలాంటి చంద్రబాబును నమ్మలేమని స్పష్టం చేశారు. పిల్లల భవిష్యత్తు బాగుండాలంటే జగనన్నను గెలిపించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ట్యాబ్‌లను బలసాని కిరణ్ కుమార్ ఎంపీపీ, జెడ్పీటీసీలతో పంపిణీ చేశారు. అనంతరం పదవ తరగతి విద్యార్థులకు జగనన్న విద్యాజ్యోతి స్టడీ మెటీరియల్ అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ చిలకా రాజ్యం, జెడ్పీటీసీ సభ్యులు భీమినేని వెంకటలక్ష్మి, వైస్ ఎంపీపీ శ్రీనివాసరెడ్డి, ఎంపీటీసీ పుష్పలత, పార్టీ మండల కన్వీనర్ మన్నవ వీరనారాయణ, పార్టీ జిల్లా కార్యదర్శి నాదెండ్ల రామచంద్రయ్య, మార్కెట్ యార్డు డైరెక్టర్ బి.వెంకటేశ్వరరావు, సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

పెంచిన పింఛన్ల పంపిణీ



పింఛను పంపిణీ చేస్తున్న జెడ్పీటీసీ సభ్యుడు సుబ్బారావు

గుంటూరురూరల్: గుంటూరు రూరల్ జెడ్పీటీసీ తుమ్మల సుబ్బారావు శనివారం చినపలకలూరు గ్రామంలో రూ. 3 వేలు పింఛన్లను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సచివాలయం సెక్రటరీ జోత్స్న, సిబ్బంది రాజేశ్వరి, తోట నాగేశ్వరరావు, తంగెళ్ల నాగేశ్వరరావు, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతున్న వృద్ధుడికి..

పొన్నూరు: వైఎస్సార్ పెన్షన్ కానుక వారోత్సవాలు కసుకర్రు గ్రామంలో శనివారం నిర్వహించారు. పెంచిన పింఛన్లు మొత్తం 481 లబ్ధిదారులకు సచివాలయ సిబ్బంది, వలంటీర్లు అందజేశారు.



చికిత్స పొందుతున్న వృద్ధుడికి పింఛన్ అందిస్తున్న వలంటీర్

వడ్లమూడిలోని ఓ ప్రైవేటు వైద్యశాలలో చికిత్స పొందుతున్న వృద్ధుడు బొప్పన సుబ్బారావుకు వలంటీర్ కాకుమాను పవన్‌కుమార్ రూ. 3వేలు పింఛన్ అందజేశారు. వైఎస్సార్ సీపీ నాయకులు నాగిశెట్టి నరసింహ ఉన్నారు.

జడవల్లిలో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర

పొన్నూరు: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించే వికసిత్ భారత్ సంకల్ప యాత్ర శనివారం మండలంలోని జడవల్లి గ్రామంలో నిర్వహించారు. గ్రామ సర్పంచ్ పిల్లి ఇందిర ప్రియదర్శిని పాల్గొని, గ్రామంలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. కేంద్ర సంక్షేమ పథకాలను అధికారులు వివరించారు. డ్రోన్ ద్వారా వ్యవసాయం చేసే విధానాన్ని ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాసరావు, నాయకులు పిల్లి మాణిక్యరావు, జె.మునలయ్య, గుమ్మడి మరియదాసు, గుమ్మడి రమేష్, కర్లపూడి ఎలిషా పాల్గొన్నారు.

అలరించిన కూచిపూడి నృత్య ప్రదర్శన

నగరంపాలెం: నాగార్జున సాంస్కృతి కేంద్రం / నాగార్జున మ్యూజిక్ కళాశాల సంయుక్తంగా శనివారం బ్రాడీపేట 2/14వ అడ్డరోడ్‌లో భావనచిన్న వజ్జల కుచిపూడి నృత్య ప్రదర్శన నిర్వహించారు. పద్మశ్రీ డాక్టర్ వై.నాయుడు, విజయవాడ డీసీపీ విశాల్‌గున్ని అతిథులుగా విచ్చేసి, నృత్య ప్రదర్శన చేసిన భావనచిన్నను అభినందించారు. ఆలయ కమిటీ అధ్యక్షులు మస్తానయ్య జ్యోతి ప్రజ్వలనతో ప్రదర్శనను ప్రారంభించగా, కళాశాల అధ్యక్షులు డాక్టర్ ఎం.సత్యనారాయణ అధ్యక్షతన చేపట్టారు. నాగార్జున కల్చర్ సెంటర్ కార్యదర్శి పీఎస్ఎన్.మూర్తి, కళాశాల కార్యదర్శి డాక్టర్ ఎం.శ్రీధర్, డాక్టర్ కె.సూర్యనారాయణ పాల్గొన్నారు.

నేటితో ముగియనున్న విశాలాంధ్ర పుస్తక ప్రదర్శన

నగరంపాలెం: విశాలాంధ్ర బుక్ హౌస్ ఆధ్వ ర్యంలో గుంటూరు లాడ్జి సెంటర్‌లోని ఏఎల్ బీఈడీ కళాశాల ఆవరణలో ఏర్పాటు చేసిన 23వ పుస్తక మహోత్సవం (పుస్తక ప్రదర్శన) ఆదివారంతో ముగియనుందని బుక్ హౌస్ మేనేజర్ ఎం.మల్లికార్జునరావు శనివారం తెలిపారు. వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు డొక్కా మాణిక్య వరప్రసాద్ పుస్తక ప్రదర్శనను సందర్శించారు.

జాతీయస్థాయి యువజనోత్సవాలకు ఎంపిక

గుంటూరు ఎడ్యుకేషన్: మహారాష్ట్రంలోని నాసిక్‌లో ఈ నెల 12 నుంచి 16వ తేదీ వరకు జరగనున్న 27వ జాతీయస్థాయి యువజనోత్సవాల్లో టీజేపీఎస్ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ నిర్వహణ అధికారి డాక్టర్ జేవీ సుధీర్‌కుమార్‌తో పాటు విద్యార్థిని పి. స్వాతి ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపల్ ఏబీపీ మనోహర్ తెలిపారు. శనివారం పట్టాభిపురంలోని కళాశాలలో జరిగిన కార్యక్రమంలో మనోహర్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ నుంచి 50 మంది ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పాల్గొంటున్నట్లు తెలిపారు. యువజనోత్సవాల్లో వారం రోజుల పాటు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు వివిధ రాష్ట్రాల ఆచారాలు, కళా వైభవాలపై ప్రదర్శన ఇస్తారని చెప్పారు.

వాహనం ఢీ కొని నంబూరు మహిళల దుర్మరణం

కృష్ణలంక(విజయవాడతూర్పు): గుర్తుతెలియని వాహనం ఢీకొని ఇద్దరు మహిళలు దుర్మరణం పాలయ్యారు. ఈ ఘటన కృష్ణలంక పోలీస్ స్టేషన్ పరిధిలోని వారధి చెక్‌పోస్టు సమీపంలో జరిగింది. పోలీసుల వివరాల మేరకు.. గుంటూరు జిల్లా పెదకాకాని మండలం నంబూరు గ్రామానికి చెందిన వేమూరి షారోన్, స్వప్న(23) భార్యాభర్తలు. వీరికి కుమార్తె, కుమారుడు ఉన్నారు. షారోన్ ఆటో డ్రైవర్. స్వప్న ఇంటి వద్దనే ఉంటోంది. శుక్రవారం రాత్రి స్వప్న గుణదల మేరీమాత మందిరానికి వెళ్లి నిద్ర చేసి వస్తానని భర్తకు చెప్పింది. దూరపు బంధువైన నంబూరు బాబు భార్య శిరీష(29)తో కలిసి ద్విచక్ర వాహనంపై గుణదలకు స్వప్న బయలుదేరింది. కనకదుర్గ వారధి చెక్‌పోస్టు దాటగానే.. గుంటూరు వైపు నుంచి విజయవాడకు అతివేగంగా వెళ్తున్న గుర్తు తెలియని వాహనం ద్విచక్ర వాహనాన్ని బలంగా ఢీకొట్టింది. దీంతో ఇద్దరూ కిందపడిపోయారు. ఆ వాహనం వారి తలల మీదుగా వెళ్లడంతో ఇద్దరి తలలు నుజ్జునుజ్జయి ఘటనా స్థలంలోనే మరణించారు. సమాచారం అందుకున్న పోలీసులు మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతురాలు స్వప్న భర్త షారోన్ ఫిర్యాదు మేరకు.. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

సమాచార సేకరణ, భావ వ్యక్తీకరణ కీలకం

కేంద్ర పొగాకు పరిశోధన సంస్థ శాస్త్రవేత్త రవిశంకర్

గుంటూరు ఎడ్యుకేషన్: విద్యార్థులకు సమాచార సేకరణ, భావ వ్యక్తీకరణ నైపుణ్యాలు కీలకమని రాజమహేంద్రవరంలోని కేంద్ర పొగాకు పరిశోధన సంస్థ ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ సీహెచ్ రవిశంకర్ పేర్కొన్నారు. అమరావతిరోడ్డులోని హిందూ కళాశాల పీజీ కోర్సుల విభాగంలో శనివారం ఎంసీఏ ప్రథమ సంవత్సర విద్యార్థులకు ఇండక్షన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న రవి శంకర్ కార్పొరేట్ ప్రపంచంలో కృత్రిమ మేధస్సు పాత్ర అనే అంశంపై మాట్లాడుతూ చదువుతో పాటు భావ వ్యక్తీకరణ నైపుణ్యం ఎంతో కీలకమని, భావ వ్యక్తీకరణ లేనిచో పనిచేసే ప్రదేశంలో రాణించలేరని స్పష్టం చేశారు. యూఎస్ఏకు చెందిన సీనియర్ ఇంజినీరింగ్ మేనేజర్ శ్రీనాథ్ మిత్ర సింగం మాట్లాడుతూ కంప్యూటర్ అప్లికేషన్స్‌లో మాస్టర్స్ చదువుతున్న విద్యార్థులు ప్రధానంగా సంబంధిత సబ్జెక్టుల్లో పరిజ్ఞానంతో పాటు నైపుణ్యాలను అభివృద్ధి పరచుకుని, ఇంటర్వ్యూలో విజయం సాధించాలని సూచించారు.



శాస్త్రవేత్త రవిశంకర్‌ను సత్కరిస్తున్న ఎస్వీ రమణ, సుబ్బారావు, శ్రీనాథ్ మిత్ర, లక్ష్మీనారాయణ

కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్వీ రమణ మాట్లాడుతూ ఇండక్షన్ ప్రోగ్రామ్‌ను పరిశ్రమలకు విద్యార్థులను అనుసంధానం చేసే విధంగా చేస్తున్న చిరు ప్రయత్నమని వివరించారు.

హిందూ కళాశాల కమిటీ ఉపాధ్యక్షుడు ఎస్వీఎస్ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ విద్యాసంవత్సరాన్ని ప్రారంభించడమే కాకుండా సంపూర్ణ విద్యాబోధనపై నిబద్ధతను చాటుతుందన్నారు. కార్యక్రమంలో హిందూ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్ సుబ్బారావు, సహాయాచార్యులు డాక్టర్ ఈశ్వర్ ప్రసాద్, అభిష షర్లీ, నాగుల్ మీరావలి, విద్యార్థులు పాల్గొన్నారు.

గత ప్రభుత్వాలు సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించాయి

సమన్వయకర్త షేక్ నూరి ఫాతిమా

పట్నంబజారు: గత ప్రభుత్వాలు ప్రజలకు సంక్షేమాన్ని అందజేయటంలో పూర్తి వైఫల్యం చెందాయని వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త షేక్ నూరిఫాతిమా విమర్శించారు. శనివారం నియోజకవర్గ పరిధిలోని మూడోవ డివిజన్ కార్పొరేటర్ పోలవరపు జ్యోతి ఆధ్వర్యంలో వైఎస్సార్ ఫించన్ పెంపు కార్యక్రమంలో పాల్గొన్నారు. యాదవులబజారు కృష్ణుడి కల్యాణ మండపంలో అర్హులైన వారికి ఫించన్ అందజేశారు. ఈ సందర్భంగా నూరిఫాతిమా మాట్లాడుతూ గత ప్రభుత్వాలు పేదలకు మొండిచేయి చూపెట్టాయని, ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి నిరుపేదలకు సంక్షేమాన్ని చేరువ చేశారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేతలు వెంకటేశ్వరరావు, ఆంజనేయులు, మాధవరావు, బాబు, తోట మణికంఠ, తదితరులు పాల్గొన్నారు. డీఎస్ నగర్, ఏటుకూరు రోడ్డులోని పీకలవాగును పరిశీలించారు.

జీజీహెచ్‌కు విలువైన వస్తువుల వితరణ

గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్‌లో పనిచేస్తున్న నాల్గో తరగతి ఉద్యోగులు, నర్సింగ్ సిబ్బంది, పారా మెడికల్ సిబ్బంది, వైద్యులు ఆసుపత్రి అభివృద్ధి కోసం మానవత్వంతో రూ. 6 లక్షల విలువ గల వస్తువులను అందచేసినట్లు ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్ కుమార్ తెలిపారు. శనివారం సూపరింటెండెంట్ చాంబర్‌లో నూతన సంవత్సరం సందర్భంగా పలువురు దాతలు అందచేసిన వివిధ వస్తువులను ఆయా విభాగాలకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ కిరణ్ కుమార్ మాట్లాడుతూ నూతన సంవత్సరం పురస్కరించుకుని ప్రతి ఒక్కరు ఆసుపత్రికి ఉపయోగపడే వస్తువులను అందించాలని తాను ఇచ్చిన పిలుపు మేరకు వస్తువులను అందచేసిన అందరికీ కృతజ్ఞలు తెలిపారు. ఆసుపత్రికి ఆరు నెలల వరకు ఉపయోగపడే స్టేషనరీ ఇవ్వడం అభినందనీయమన్నారు. రోగులకు మెరుగైన వైద్యం అందించడానికి ప్రతిఒక్కరూ తమవంతు కృషి చేస్తున్నారని పేర్కొన్నా రు. ఆసుపత్రికి రోజుకు నాలుగు వేల మందికి పైగా రోగులు వస్తున్నారని, అందులో రెండు వేలకు పైగా రోగులు ఇన్ పేషంట్స్‌గా వార్డులో చేరుతున్నట్లు వెల్లడించారు. ప్రభుత్వం ఆసుపత్రి అభివృద్ధి కోసం అన్ని విధాలా కృషి చేస్తోందన్నారు. అందులో భాగంగా వందల పోస్టులను భర్తీ చేస్తుందన్నారు. నగరంలోని ఉదయ్ ఆసుపత్రి అధిపతి బ్లడ్ బ్యాంక్‌కు అవసరమైన రూ. 1.80 లక్షల విలువగల పరికరాలను అందచేసినట్లు చెప్పారు. జూనియర్ డాక్టర్లు, నర్సింగ్ సిబ్బంది, జనరిక్ మందుల షాపు నిర్వాహకులు ముందుకు వచ్చి అధిక మొత్తంలో పరికరాలను అందచేశారన్నారు.



వితరణ వస్తువులను అందజేస్తున్న డాక్టర్ కిరణ్‌కుమార్

కార్యక్రమంలో డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ డి.ఎస్.ఎస్.శ్రీనివాస ప్రసాద్, సివిల్ సర్జన్ ఆర్ఎంఓ డాక్టర్ బత్తుల వెంకట సతీష్ కుమార్, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సుధాకర్ రెడ్డి, నర్సింగ్ సూపరింటెండెంట్ కె.ఆశరోజని, అడ్మినిస్ట్రేటర్ ప్రవీణ్ కుమార్ పాల్గొన్నారు.

అధికారులు సమన్వయంతో పనిచేయాలి



మాట్లాడుతున్న జెడ్పీటీసీ సభ్యురాలు గుల్జార్ బేగం

కాకుమాను: మండలంలో అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలుపై చర్చించే సమావేశానికి అధికారులు హాజరు కాకపోతే ఎలా అని జెడ్పీటీసీ ముజావర్ షేక్ గుల్జార్ బేగం ప్రశ్నించారు. స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో శనివారం మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ రామినేని శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా జెడ్పీటీసీ గుల్జార్ బేగం మాట్లాడుతూ సర్వసభ్య సమావేశానికి కూడా అన్ని శాఖల అధికారులు హాజరు కాకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతి అధికారి సమన్వయంతో పని చేస్తేనే గ్రామాల్లో అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. ఎంపీపీ రామినేని శ్రీనివాసరావు మాట్లాడుతూ మండల అభివృద్ధిలో ప్రతి అధికారి భాగస్వామి కావాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో సర్పంచ్‌ల సంఘం మండలాధ్యక్షుడు వింతా రాఘవరెడ్డి, మండల ఉపాధ్యక్షుడు పెదపూడి కపిల్, తియ్యగూర వెంకటరెడ్డి, కాకుమాను సర్పంచ్ శివకుమారి, మండల కో-ఆప్షన్ సభ్యులు సేక్ సుభాని, తహసీల్దారు జె.ప్రసాదరావు, అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

కూరగాయల సాగులో మెళకువలు తప్పనిసరి



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా పీడీ కె.రాజకుమారి

చేబ్రోలు: వేజండ్ల గ్రామంలో ప్రకృతి వ్యవసాయం క్షేత్రస్థాయి కార్యాచరణ ప్రణాళిక డివిజనల్ స్థాయి సమావేశం శనివారం జరిగింది. కూరగాయల సాగు రైతులతో ప్రాజెక్ట్ మేనేజర్ కె.రాజకుమారి వివిధ అంశాలపై మాట్లాడారు. తెగుళ్లు ఎర్రనల్లి, తెల్ల దోమ, పచ్చ దోమ, వేరు పురుగు వంటి సమస్యలను ఆమె దృష్టికి రైతులు తీసుకువచ్చారు. ప్రకృతి వ్యవసాయం చేసే రైతులు సమస్యలు ఎలా అధిగమించాలో ఆమె వివరించారు. ఆరు సంవత్సరాలుగా ప్రకృతి వ్యవసాయం చేస్తున్న తోట బ్రహ్మయ్య, కంకిపాటి ప్రభుదాస్ తదిత రైతులను ప్రాజెక్టు మేనేజర్ రాజకుమారి ఘనంగా సన్మానించారు. ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, స్థానిక రైతులు పాల్గొన్నారు.